# ప్రయోజకుడు

- భాస్కర్ డి వి ఆర్

పూర్వం రామాపురం అనే గ్రామంలో కోటమ్మ అనే పేదరాలు ఉండేది. ఆమె ఎలాగైనా సరే తండ్రిలేని తన కొడుకు గోవిందును ప్రయోజకుణ్ణి చెయ్యాలని కలలు కనేది. అందుకోసం తన రెక్కలు ముక్కలు చేసుకుని గోవిందుని తన శక్తిమేరకు చదివించింది. ఒకరోజు ఆమె తన కొడుకును పిలిచి "నాయనా! పొరుగూరిలో రామస్వామి అని ఒక ధనికుడున్నాడు. ఆయన చాలా మంచివాడని విన్నాను. నువ్వు ఆయన సాయంతో ఏదైనా వ్యాపారం చేసుకుని నీ కాళ్ళమీద నీవు నిలబడు" అని చెప్పింది. సరేనని తల ఊపి గోవిందు రామస్వామి వద్దకు వెళ్లి తన పరిస్థితిని ఆయనకు చెప్పుకుని సహాయం చేయమని అడిగాడు. అయితే, దురదృష్టవశాత్తూ గోవిందు ఆ వ్యాపారిని కలిసిన సమయంలో ఆయన ఏదో చికాకులో ఉన్నాడు. దాంతో ఆయన గోవిందు మాటలు సరిగ్గా వినకుండానే పక్కనే పడి ఉన్న ఒక చచ్చిన ఎలుకను గోవిందు మీదకు విసిరి, "ప్రస్తుతానికి ఇదే నేను చేసే సహాయం. తెలివితేటలుంటే దీంతోనే పైకి రావచ్చ"న్నాడు.

ఆ పెద్దమనిషి ప్రవర్తనకు గోవిందుకు బాధ కలిగినా తమాయించుకున్నాడు. ఆయన్ను ఏమి అనకుండా ఆ ఎలుకనే పుచ్చుకుని తిరుగు ప్రయాణం కట్టాడు. ఇంటికి త్వరగా చేరాలన్న ఆతృతలో అడ్డదోవ పుచ్చుకుని వెళ్తున్న గోవిందు కొద్ది దూరం నడిచాక తాను దారి తప్పినట్లు తెలుసుకున్నాడు. అయినా, వెనుదిరగటం ఇష్టంలేక అలానే ప్రయాణం కొనసాగించాడు.

ఇంతలో ఎదురుగా కొందరు బాటసారులు వస్తూ కనిపించారు. వారిలో ఒకరి చేతిలో పిల్లికూన ఒకటి ఉంది. ఆకలితో నకనకలాడుతున్న ఆ పిల్లి యజమాని చేతిలోంచి తప్పించుకుని చెంగున ఎగిరి గోవిందు చేతిలో ఉన్న ఎలుకను నోటకరుచుకుని ఆవురావురుమని తినేసింది. ఇదంతా క్షణాల్లో జరిగిపోయింది. అసలు విషయమేమిటంటే ఆ పిల్లి ఒక జమిందారు భార్య గారాల పెంపుడు పిల్లి. దానికేదో జబ్బు చేసి రెండు రోజులుగా తిండి తినకపోవడంతో వాళ్ళు దానిని వైద్యుని వద్దకు తీసుకెళ్తున్నారు. పిల్లికి ఆకలి పుట్టేసరికి వాళ్లకి సంతోషం వేసింది. అందుకు ప్రతిఫలంగా వాళ్ళు గోవిందు చేతిలో కొన్ని చిల్లర నాణాలు

www.sirimalle.com

ఉంచబోయారు. గోవిందు వారితో, "అయ్యా! పొద్దునెప్పుడో తిన్నాను. బాగా ఆకలిగా ఉంది. ముందు తినడానికేమైనా ఉంటే పెట్టండి" అన్నాడు. వాళ్ళు జాలిపడి తాము దారిలో తిందామని తెచ్చుకున్న గుగ్గిళ్ళ మూటను గోవిందు చేతిలో పెట్టి తమ దారిన తాము వెళ్ళిపోయారు.

మిట్టమధ్యాహ్నమైంది. గోవిందు ఒక పెద్ద మర్రిచెట్టు నీడకు చేరి ప్రక్కనే ఉన్న నీటి చెలమలో ముఖం కాళ్ళు, చేతులు కడుక్కుని, గుగ్గిళ్ళ మూట విప్పాడు. అదే సమయంలో పక్కనే ఉన్న అడవిలో కట్టెలు కొట్టుకునేవాళ్ళు కొందరు వచ్చి విశ్రాంతి తీసుకునేందుకు చెట్టు నీడన చేరారు. గోవిందుకు వాళ్ళతో మాట కలవడంతో తను తినే గుగ్గిళ్ళనే వాళ్ళకూ తలా కాసిని పెట్టాడు. వాళ్లకు అవి బాగా నచ్చడంతో వెళ్ళేముందు తమ మోపుల్లోంచి కొన్ని కట్టెలు తీసి గోవిందుకు ఇచ్చారు. గోవిందు వాటిని మోపుగా కట్టి నెత్తిన పెట్టుకుని ఊళ్ళోకెళ్ళి వాటిని అమ్మాడు. వచ్చిన డబ్బుతో కొన్ని శనగలు, కొంత మసాల సామగ్రి కొని, గుగ్గిళ్ళు తయారుచేశాడు. వాటిని నాలుగు రోడ్ల కూడలిలో ఒక ప్రక్కగా కూర్చుని అమ్మడం మొదలు పెట్టాడు. ఆ మసాలా వాసనకు, ఆ దారిన పోయేవాళ్ళు, పనిపాటలు చేసుకునే వాళ్ళు వాటిని ఎగబడి కొన్నారు. పెట్టుబడికి రెండింతలు ఆదాయం రావడంతో తన బతుకు తెరువుకు ఆ వ్యాపారాన్నే ఎంచుకున్నాడు గోవిందు. తలదాచుకునేందుకు ఒక చిన్న ఇల్లు తీసుకుని ఊరెళ్ళి తల్లిని కూడా వెంటబెట్టుకొచ్చాడు.

గోవిందు గుగ్గిళ్ళు చేస్తుంటే కోటమ్మ బజ్జీలు, పులిబొంగరాలు, దోసెలు చేసేది. మరికాస్త వెసులుబాటు దొరికినప్పుడు రకరకాల మిఠాయిలు కూడా తయారుచేసేది. వాళ్ళు చేసే పిండివంటలు రుచిగా, శుచిగా ఉండటంతో తల్లీ కొడుకుల వంటకాలకు ఊళ్ళో మంచి గిరాకి ఏర్పడింది. ఆదాయంతో పాటు పని వత్తిడి కూడా పెరగడంతో గోవిందు తల్లికి సాయంగా ఇద్దరు చురుకైన కుర్రాళ్ళను పెట్టాడు. చూస్తుండగానే గోవిందు వ్యాపారం మంచి ఊపందుకుంది.

అలా ఓ నాలుగేళ్ళు గడిచాయి. గోవిందు ఇప్పుడు ఒక పెద్ద భవంతి, నాలుగైదు పెద్ద మిఠాయి దుకాణాలకు యజమాని. ఓరోజు గోవిందు ఊరిలోని గొప్ప గొప్ప వాళ్ళందరినీ తమ ఇంటికి విందుకు ఆహ్వానించాడు. దానికి రామస్వామిని కూడా ఆహ్వానించాడు. విందు ముగిసిన తర్వాత ప్రతి ఒక్కరికీ తాంబూలం ఇచ్చి పంపాడు. రామస్వామికి ఇచ్చే తాంబూలంలో మాత్రం ఒక బంగారు ఎలుకను పెట్టి ఇచ్చాడు.

అది చూసి అవాక్కయిన రామస్వామి, జరిగినదంతా గోవిందు నోటివెంబడే తెలుసుకుని, ఆ రోజు జరిగిన దానికి ఎంతగానో నొచ్చుకుని, అతడి ప్రయోజకత్వానికి మనసులోనే ఎంతో సంతోషించి, గోవిందు నుంచి వీడ్కోలు తీసుకున్నాడు. మర్నాడే కోటమ్మకు కబురుచేశాడు తమతో వియ్యమందడం ఇష్టమేనా అని! రామస్వామి అంతటి పెద్ద మనిషి తనంత తాను పిలిచి పిల్లనిస్తాననేసరికి ఎగిరి గంతేసిన కోటమ్మ అందుకు ఆనందంగా అంగీకరించింది. పెళ్లివిందు అనంతరం రామస్వామి బంధువులందరికీ తాంబూలంలో తలా ఒక వెండి ఎలుకను పెట్టి ఇచ్చాడు!